క్లుప్తంగా

అర్బన్ పీహెచ్‌సీ భవన నిర్మాణాల పరిశీలన



గాంధీనగర్‌లో సీసీ రోడ్డు పరిశీలిస్తున్న డీఈఈ

రాజాం: పట్టణంలో ఆదర్శనగర్, డోలపేట గ్రామాల వద్ద కొత్తగా నిర్మించిన అర్బన్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మున్సిపల్ డీఈఈ చంద్రమౌళి బుధవారం పరిశీలించారు. కాంట్రాక్టర్ల వద్ద వివరాలు సేకరించారు. వచ్చే నెలాఖరులోగా వీటిని అప్పగించాలని సూచించారు. అనంతరం డీఈఈ విలేకరులతో మాట్లాడుతూ రాజాంలో రెండు అర్బన్ పీహెచ్‌సీల నిర్మాణం చివరి దశకు వచ్చిందని అన్నారు. ఒక్కో చోట రూ.80 లక్షల అంచనా వ్యయంతో వీటి నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో గాంధీనగర్‌లో ఇటీవల నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యత పరిశీలించారు. ఆయన వెంట ఏఈ పి.వెంకట్, ఎన్విరాన్‌మెంటల్ ఏఈ భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

రూ.6.80 కోట్లతో నూతన భవనం



నూతనంగా నిర్మించిన భవనం

రాజాం: రాజాం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద రూ.6.80 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించారు. రోగులకు అత్యవసర సేవలతో పాటు ఆధునిక వైద్య సేవలు అందించేందుకు ఈ భవన నిర్మాణాన్ని ఏడాది క్రితం ప్రారంభించినట్లు సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి వెల్లడించారు. ఆస్పత్రి నూతన భవనాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

దిశ యాప్‌తో రక్షణ



వంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో దిశ యాప్‌పై అవగాహన

వంగర: ప్రభుత్వం మహిళల రక్షణ కోసం అమలు చేస్తున్న దిశ చట్టంలో భాగంగా దిశ యాప్‌తో స్త్రీలకు రక్షణ కలుగుతోందని వంగర సచివాలయం మహిళా పోలీస్ సీహెచ్ లక్ష్మి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో దిశ యాప్, సైబర్ నేరాలతో కలిగే నష్టాలు, వాటిని అధిగమించేందుకు సూచనలను ఓ నాటిక రూపంలో విద్యార్థులతో బుధవారం ప్రదర్శన చేపట్టారు. సెల్‌ఫోన్ల ఉపయోగం వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరిపురం హైస్కూల్‌కు క్రీడా ప్రతిభ అవార్డు

సంతకవిటి: క్రీడల్లో మంచి ప్రతిభ కనబరచి జిల్లాలో మొదటి 5 స్థానాల్లో నిలచిన పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు సిరిపురం పాఠశాల 5వ స్థానంలో నిలిచి 2022 – 23 సంవత్సరానికిగాను క్రీడా ప్రతిభ అవార్డు సొంతం చేసుకుందని పాఠశాల హెచ్‌ఎం వి.వెంకటరావు తెలిపారు. సిరిపురం విద్యార్థులు క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచేలా ప్రోత్సహించి, పాఠశాలకు క్రీడా ప్రతిభా అవార్డు రావడంలో ముఖ్య పాత్ర వహించిన పీడీ సన్నిబాబును మంగళవారం విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో జెడ్పీ సీఈఓ రామ్‌గోపాల్, డీఆర్‌ఓ తిరుపతిరావులు సత్కరించి, అవార్డును ప్రదానం చేశారు.

ఆర్థిక నిర్వహణపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ చిరంజీవి

రాజాం : మండలంలో ప్రతీ మహిళా సంఘ అధ్యక్షులు తమ సంఘాల ఆర్థిక నిర్వహణపై అవగాహన కల్గి ఉండాలని, సంఘానికి ఆర్థికంగా బలోపేతం చేయగలగాలని వైఎస్‌ఆర్ క్రాంతి పథం రాజాం ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవి సూచించారు. స్థానిక వైఎస్‌ఆర్ క్రాంతి పథం భవనంలో మండలంలో గ్రామైఖ్య సంఘ అధ్యక్షులకు బుధవారం సమావేశం నిర్వహించి శిక్షణ ఇచ్చారు. ప్రతీ గ్రామ సంఘానికి సంబంధించిన అధ్యక్షులు ఆర్థిక మేనేజ్‌మెంట్ చేయడం, వాటిని నిర్వహించడంపై అవగాహన కల్పించారు. ప్రతీ మహిళ ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని వివరించారు. కార్యక్రమంలో మండల మహిళా సమైఖ్య అధ్యక్షులు సామంతుల అరుణకుమారి, ఏపీఎంలు టి.దధికుమార్, కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బాడంగి: ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముగడ గ్రామ కొత్తూరు కాలనీలో బుధవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందక పోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త రికార్డు సృష్టించారన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం అమలులోని పథకాలతో ప్రతీ ఇంటికి మేలు జరుగుతోందన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం జగనన్న ధ్యేయమని, ఓ వైపు అభివృద్ధి పనులు జోరుగా చేపడుతూనే మరోవైపు సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అమలు చేస్తున్నారన్నారు. డీబీటీ విధానం ద్వారా పథకాల సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడంతో అవినీతి తగ్గిందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిన దాఖలాలు లేవని, ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే నేరుగా పథకాలు అందిస్తూ అందరి వాడుగా పేరుతెచ్చుకున్న సీఎం జగనన్ననే మరోసారి ఆశీర్వదించి, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఎన్నికల వేళ టీడీపీ నేతలు చెప్పే మాయమాటలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో పార్టీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు, ఎంపీపీ భోగి గౌరి, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీక 'రాఖీ'



రాజాం సిటీ: రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

రాజాం సిటీ: అన్నాచెల్లెళ్లు.. అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమ... ఆప్యాయతలకు చిహ్నంగా జరుపుకునే పండగ రక్షాబంధనం. రక్త సంబంధీకులు లేకున్నా మన కోసం అండగా నిలిచే ఆప్తుల్ని సమాజం అందిస్తుంది. అలాంటి వారికి రాఖీ కట్టి సోదరభావాన్ని పెంపొందించుకునేందుకు రాఖీ పౌర్ణమి మంచి సందర్భం. ఆడపడుచుకు నేనున్నానని సోదరుడు కల్పించే భరోసాకు ప్రతీక రాఖీ పౌర్ణమి. రాఖీలు కొనుగోలు చేసేందుకు యువతులు పట్టణాల్లోని రాఖీ షాపుల వద్ద బిజీబిజీగా సందడి చేశారు. అందుబాటులో పలు రకాల రాఖీలు, గిఫ్ట్ ప్యాక్‌లు

కులాలు, మతాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా జరుపుకునే ఆత్మీయ పండగ రాఖీపౌర్ణమి. అక్క, చెల్లెలు తమ సోదరుడుకి రాఖీ కట్టి తిలకం దిద్దిన తరువాత వారికి బహుమానం ఇవ్వడం ఆనవాయితీ. పూర్వం డబ్బులు, నగలు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పద్ధతి ఉన్నా వాటితో పాటు పలు రకాలు గిఫ్ట్‌గా ఇస్తున్నారు.

రామభద్రపురం: రాఖీ పండగ పురస్కరించుకుని, స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుకు బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సోదరీమణులు బుధవారం రాఖీ కట్టి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రక్షాబంధన్ విశిష్టతను వివరించి, అక్కచెల్లెమ్మలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

బొబ్బిలి: మండలంలోని అలజంగి సీబీఎం పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విరామ సమయంలో బాలికలంతా బాలురకు రాఖీలు కట్టి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.



రామభద్రపురం: ఎంపీపీ లక్ష్మణరావుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



బొబ్బిలి: అలజంగి పాఠశాలలో బాలురుకు రాఖీ కడుతున్న బాలికలు

ఇరువాడలో బోర్ల మరమ్మతులు

వంగర: మండల పరిధి ఇరువాడ గ్రామంలో తాగునీటి బోర్లు మరమ్మతులు చేపట్టారు. ఇటీవల ప్రధాన వీధుల్లో పాడైన బోర్లును సర్పంచ్ పెద్దిరెడ్డి విజయ ఆధ్వర్యంలో బోర్ మెకానిక్ కళింగ కృపారావు మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరా చేపట్టారు.

గ్రామాల్లో చురుగ్గా భూ సర్వే

రాజాం: గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షణ సర్వే చురుగ్గా జరుగుతుంది. రాజాం మండలంలో 21 గ్రామాల్లో అధికారులు ప్రాథమిక సర్వేను పూర్తి చేశారు. 14 గ్రామాల్లో సర్వే హద్దురాళ్లు వేశారు. హద్దురాళ్లు పూర్తయిన గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలు అందిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్కే రాజు వెల్లడించారు.

దోమల నివారణకు చర్యలు

వంగర: మండల పరిధి రుషింగి గ్రామంలో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారు. సర్పంచ్ యలకల భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి గుత్తావల్లి దీప్తి ఆధ్వర్యంలో వీధుల్లోని డ్రైనేజీలు, మురుగునీటి నిల్వ ప్రదేశాలు, చెత్తచెదారాలు ఉండే పరిసరాల్లో ఈ మందును పిచికారీ చేసి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టారు. వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శి దీప్తి ప్రజలకు చైతన్యం చేస్తున్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు

బొబ్బిలి: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని పక్కి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆస్పత్రి అభివృద్ధి సంఘ సమావేశానికి హాజరైన ఆమె ఆస్పత్రిలో రోగులకు కల్పిస్తున్న సదుపాయాలు, వైద్యసేవలు, అందుబాటులో ఉన్న మందుల వివరాలపై ఆరాతీశారు. అలాగే ఆస్పత్రికి అవసరమైన పనులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో వైద్యాధికారి లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాకరాపల్లిలో 'గడప గడపకు'

సంతకవిటి: మండలంలోని కాకరాపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం 4గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు జెడ్పీ వైస్‌చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు బుధవారం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి

- జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి కె.గోవిందమ్మ



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి గోవిందమ్మ

తెర్లాం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి కె.గోవిందమ్మ సూచించారు. మండలంలోని పెద పొలవలస గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మండల వ్యవసాయాధికారి జి.సునీల్‌కుమార్ అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంలో వరిసాగు–యాజమాన్య పద్ధతులపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనశుద్ధి దగ్గర నుంచి పంట చేతికి వచ్చే వరకు అవలంభించాల్సిన అన్ని యాజమాన్య పద్ధతులను తెలుసుకోవాలన్నారు. అలాగే సూడోమోనాస్(జీవన శిలీంధ్రనాశిని)ఉపయోగం, నీటిఎద్దడిపై తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వరిపంటను ఆశించే చిన్నచిన్న తెగుళ్ల నివారణకు పేడ, ఇంగువతో చేసిన ద్రావణం వినియోగించాలని, దానిని ఏవిధంగా తయారు చేయాలో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం పూనువలస క్లస్టర్ మండల యాంకర్ ఎ.సింహాద్రి నాయుడు, ఏఈవో ఇందిర పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం



ఉనుకూరులో ఇంటింటికి కరపత్రాల పంపిణీ

రేగిడి : ప్రజా సమస్యలు పరిష్కారానికి సీపీఎం పోరాటం చేస్తుందని ఆ పార్టీ నేతలు సీపీఎం పార్టీ నాయకులు పోరెడ్డి విశ్వనాథం, ఎం.త్రినాథ్, కె.తిరుపతిరావు అన్నారు. బుధవారం పార్టీ ఆధ్వర్యంలో రేగిడి మండలం ఉనుకూరు గ్రామంలో సమరభేరి కార్యక్రమంలో పలు అంశాలు వివరించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 1న, 3న, 4న ధర్నాలు చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

కేంద్రానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నేతలు

బొబ్బిలి: మండలంలోని ఎం.బూర్జవలస గ్రామంలో బుధవారం జరిగిన సమరభేరి కార్యక్రమంలో సీపీఎం నాయకులు కేంద్రంలోని మోదీ సర్కారు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు ఉపయోగపడే ఒక్క పని కూడా కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం చేయలేదని విమర్శించారు. అటువంటి ప్రభుత్వాన్ని గద్దెదించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా సీపీఎం నేతలు సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం తదితరులు పాల్గొన్నారు.

స్త్రీలకు రక్షణ కల్పించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: దేశంలో స్త్రీలకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ గర్ల్స్ కన్వీనర్ లావణ్య కోరారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలు స్థానిక కోట జంక్షన్ వద్ద బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళలపై బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాడులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సమీరా, సంధ్య, ఎర్రమ్మ, ఎం.హర్ష, రాజు, రమేష్ పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో తెలుగు భాషా వారోత్సవాలు

నెల్లిమర్ల రూరల్: పట్టణ పరిధిలోని వేణుగోపాలపురం డైట్ కళాశాలలో తెలుగు భాషా వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. భాషా వారోత్సవాల్లో భాగంగా బుధవారం బోధనాభ్యసన సామగ్రి ప్రదర్శనను విద్యార్థులు నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు ప్రదర్శనలు తిలకించి ఉత్తమ ప్రదర్శనను ఎంపిక చేశారు. ఛాత్రోపాధ్యాయురాలు ఎల్.ధారవి ప్రదర్శించిన నెమలి పింఛంలో తెలుగు వర్ణమాల కూర్పు న్యాయ నిర్ణేతలను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సదరు విద్యార్థినిని అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణారావు, అధ్యాపకులు ఎల్.రామకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ కల్యాణమస్తు పథకం నగదు అందజేత



కల్యాణమస్తు పథకం నగదు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు

బొబ్బిలి: స్థానిక గొల్లపల్లిలోని పదో వార్డుకు చెందిన పోలిపల్లి రమ కుమార్తె సింధు వివాహానికి వైఎస్సార్ కల్యాణమస్తు పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.లక్ష నగదును మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు చేతులమీదుగా బుధవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు అండగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలుస్తున్నారన్నారు.

ఇప్పటివరకు ఎన్నో పథకాల ద్వారా ఎంతోమంది కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. అటువంటి నాయకుడిని మనం మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ తుట్ట తిరుపతి, డోల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం సిటీ: ఉపాధి హామీ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో టీఏలు, ఎఫ్ఏలు, సీఓలతో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానవనం, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అన్నారు. గ్రామ స్థాయిలో రికార్డులు శతశాతం అప్‌డేషన్ చేయాలని, హౌసింగ్ శాఖ ప్రతిపాదనల ప్రాప్తికి వేతనదారులకు 90 రోజులు పనిదినాలు కల్పించాలని తెలిపారు. ఎవరైనా విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కెపాసిటీ బిల్డింగ్ కోర్స్ డైరెక్టర్ చిన్నంనాయుడు, ఏపీఓ కె.సాయిరాం, ఈసీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రణాళికలు



ఇందిరమ్మ కాలనీలో స్థల పరిశీలన చేస్తున్న కమిషనర్ తదితరులు

రాజాం: పట్టణంలోని అన్ని వార్డుల్లో శివారు వీధులకు కూడా తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు అన్నారు. రాజాం పట్టణంలో తాగునీటి ఇబ్బందులు ఉన్న గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఇందిరమ్మ కాలనీలో తాగునీటి ఇబ్బందులపై ఆరా తీసి, వాటర్ ట్యాంకు ఏర్పాటుకు స్థల పరిశీలన జరిపారు. పట్టణంలో తాగునీటి ఇబ్బందులు ఉన్న గ్రామాలను గుర్తించి, అమృత స్కీంలో భాగంగా తాగునీటిని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ స్కీం ద్వారా అదనపు నిధులు వస్తాయని, వాటర్ ట్యాంకులు కొత్తవి నిర్మించి, తాగునీటిని ప్రజలకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ పి.వెంకట్, ఎన్విరాన్‌మెంటల్ ఏఈ భాగ్యలక్ష్మి, సర్వేయర్ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఈవో పరిశీలన



బాడంగి పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో బ్రహ్మజీరావు



బాడంగి పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో బ్రహ్మజీరావు

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను డిప్యూటీ ఈవో పి.బ్రహ్మజీరావు బుధవారం సందర్శించి, అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. మెనూ ప్రకారం వంటకాలు వండి పెట్టాలని, ఆహార పదార్థాలు కూడా రుచి, శుచి కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి, వారు విద్యార్థులకు అందిస్తున్న బోధనా తీరు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలపై ఆరాతీశారు. నాణ్యమైన విద్యనందించాలని, ప్రతీ ఉపాధ్యాయుడు శిక్షణలో నేర్చుకున్న మెలకువలను విద్యార్థులకు నేర్పించాలని తెలిపారు. ఆ తర్వాత గొల్లాది, బాడంగి పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని సబ్జెక్ట్ టీచర్లకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. అలాగే గజరాయునివలస యూపీ పాఠశాలను చేరుకోగా, అక్కడి టీచర్ల కొరతను సర్పంచ్ సత్తిబాబు డిప్యూటీ డీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలోనే స్కూల్ అసిస్టెంట్‌ను పంపిస్తామని ఆయన సమాధానమిచ్చారు.

బోధనలోని మెలకువలు నేర్చుకోవాలి..

తెర్లాం: ఉపాధ్యాయులు పాఠ్యాంశాల బోధనలో మెలకువలు నేర్చుకుని, విద్యార్థులకు సులువైన పద్ధతిలో బోధన చేయాలని ఎంఈవో త్రినాధరావు సూచించారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని పరిశీలించిన ఆయన ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యావిధానం, కొత్త బోధనా పద్ధతులను ప్రభుత్వం అవలంభిస్తోందని, వాటికి సంబంధించి, ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రధానంగా ఉపాధ్యాయుల డైరీ, లెస్సన్ ప్లాన్ రూపొందించుకునే విధానం, బోధనా పద్ధతులు తెలుసుకోవాలన్నారు.

వర్క్‌బుక్స్ తనిఖీ..

తెర్లాం: మండలంలోని కుమ్మరిపేట ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో శంబంగి రామకృష్ణ బుధవారం సందర్శించి, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరుతో పాటు విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులు వర్క్‌బుక్స్ రాయడం, చదవడంపై ఆరాతీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేయాలని సూచించారు. జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలించి, రుచి, శుచితో కూడిన భోజనం పిల్లలకు పెట్టాలని తెలిపారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్ఏలు

విజయనగరం ఫూల్‌బాగ్: వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద వీఆర్ఏలు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడలో ముఖ్యమంత్రికి సమస్యలు చెప్పుకోవటానికి వెళ్లిన వారిని ఎక్కడికక్కడ అరెస్టులు చేసి, నిర్బంధాలతో ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమం అనంతరం డీఆర్ ఓ గణపతిరావుకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.గురుమూర్తి, ప్రసాద్, రాజు, రాంబాబు, ఆదినారాయణ, రాములప్పడు, పైడిరాజు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.